మే-జూన్
2015

29

# కవితా!

సమకాలీన కవితల కాలనాళిక







# లెక్కలు

దేవిప్రియ, 9866111874

తీరాల మధ్య
బందీ అయిన సముద్రం చేసే స్వేచ్ఛ ఘోష
భూమిలో చిక్కుబడిన
చెట్టు రెక్క విప్పుకుని
ఎగిరిపోవడానికి పడే తపన
విశ్వాంతరాళం నుంచి
విడిపోయే నరం కోసం
సూర్యచంద్రులు అనాదిగా చేస్తున్న తపస్సు
నోరులేని దేవుడితో సమస్త భాషలలో
మానవ వేదన సాగిస్తున్న
నిరర్థక సంభాషణ
పదిమంది కుబేరుల మధ్య
కోటానుకోట్ల ఫకీరుల దుఃఖనాట్యం
రాలుతున్న తారకల గణాంకాలు
రాసిపెట్టడానికేనా
ఈ అచ్చొత్తని కాగితాల దొంతరలన్నీ? ■

# నల్లతల్లి

ఈతకోట సుబ్బారావు, 9440529785

ఆకాశం చెరువు ఎండిపోయింది
నక్షత్రాలన్ని కళ్ళతో నేలని చూసిన రాత్రి
తెల్లారి నేల పొరల్లోకి యింకిపోయినట్టు
నల్లరేగడిపైన మరీచికల నీలిధూళి
పెదాలు చీలిన పొలం చెక్కల్లో
పాములు పాకిన సరసర వంకర గుర్తులు
రైతుకంటిపాపలో ఆరని తడి –
నేలకీ గగనానికీ మధ్య మూగప్రార్థన
ఎండుపరకైనా కరువైన శుష్కదేహమ్మీద
ఆబగా చూపులు సారిస్తూ నా నల్లతల్లి!
పచ్చిక శాపగ్రస్తమైన ముచ్చిరి రుతువులో
ఏదరినా గడ్డీగాదం మొలవని చావునృత్యం
అమ్మలేని నా పిల్లల పాలవెల్లి ఆకలికేక !
పూతలేదు, పిందెలేదు, కాయలేదు
చెట్టుకి చివరాశగా వొక్క ఆకైనా మిగల్లేదు
నా నల్లతల్లి క్షుధార్తి తీరే దారేలేదు
తెల్లని నురగలు కక్కుతూ, పొలాల్లో, మైదానాల్లో
సంతు నిర్లక్ష్యం చేసిన వృద్ధమాతలా సంచరిస్తూ
ఎంత బాధని మేసిందో,
ఎన్ని మంటలు మండిందో
డొక్క యెండిన బక్కదేహంతో
యెంత దూరం నడిచిందో
బతుకు ఎడారిగా మారుతున్న దృశ్యం
ఆగర్భ దరిద్రాన్ని మోస్తున్న నలుసు జీవితాలపై
కొండచరియలు విరిగిపడుతున్న దారుణం
పిడికెడు పచ్చగడ్డికి కరువేర్పడిన కరకరి
పశువైనా సగం ప్రాణంతో సొరపుతున్న నల్లతల్లి
పసరాల మందలో పిసరైనా ఆకలి తీరని ప్రాణం
సృష్టికీ తెగులెందుకు పుట్టిందో
గిట్టిన లెక్కలే కాని బట్టకట్టిన దాఖలా లేదు

జీవాల కళ్ళనిండా మాట్లాడుతున్న కన్నీళ్లు
కష్టాలకి సరిహద్దు రేఖల్ని మరిచినవాడినవాలి
పశువుకి మేతముద్ద అందించలేని దైన్యాన్ని అనాలి
పైరుకి సెలవిచ్చిన పాడిలేని పాటినేల ననాలి
కన్నీళ్ళని నెమరేస్తున్న నా నల్లతల్లి ఆకలి వెతలు
కళ్ళప్పగించి చూస్తున్న నా అవిటితనాన్ని నిలదీయాలి
పెంచిన చేతుల్తో పాడెకట్టలేని పోరామి బమ్మెర ననాలి
ఎంగిలిపడని నల్లతల్లిని అమ్మకాని కెట్టిన నా
ఈడుముంత లాంటి మనోదౌర్బల్యపు ఈయకోలు
అమ్మని అమ్ముతున్నానో
ఆత్మను అమ్ముకుంటున్నానో అర్థంకాని ఆవేదన
తలతిప్పి తిప్పి నా వైపుచూస్తూ నల్లతల్లి నిష్క్రమణ!■

# గుడ్ బై ఫార్ ఎ వైల్

హెచ్చార్కే

నెత్తురు నదులలో దిగులు మేటలు వేసి
రెల్లు పోచల మీది గాలి పాటలకు మురిసి
పడగ బయట పెట్టకు, మై మరిచి ఆడకు
వెళ్లిపో, వుండిపో
నీ లోపలి ఉమ్మ నీటి చీకటి అలల కిందనే
అక్కడ దారి తప్పి తిరిగే తలకప్ప గానే,
కొండ చెంపల మీది కన్నీటి సెల పాటగానే
గులకరాళ్లపై భరత మెరుగని నాట్యంగానే

వెళ్లిపో, నిన్ను కనబోయిన తల్లికి విషాదపు
చేతులెత్తి మొక్కి, వెళిపో, లోపలికి; శిష్టులు
తిరుగాడే చోటిది, నిశ్శబ్దం నిశ్శబ్దం, ఇక్కడ
నువ్వుండొద్దొక నల్లని బాష్పకణమై, మానని
వ్రణమై, ఆగని రణమై, వద్దు, నువ్వుండొద్దు
వెళిపో, లోపలి పొదల్లో మీగాళ్ల మీద పొంచి
కూర్చుండిపో, బహుశా, ఇంకొన్ని యుగాలు
ఎదురు చూడ్డం కూడా వ్యూహమే యుద్ధంలో ■

# యధాలాపంగా

అనిల్ డ్యాని, 9703336688

నడి రోడ్డుపై సూర్యుడు పెత్తనం చెలాయిస్తున్నాడు
నిశబ్దాన్ని ముక్కలు చేసి
సర్రున దూసుకెళ్తుంది గాలి
చిల్లర పడని చిరాకులో బిచ్చగాడు
దిక్కులు చూస్తున్నాడు
పూలపై తుమ్మెదలు రెక్కీ నిర్వహిస్తున్నాయి
బజారులో ఎక్కడో బాంబ్ పేలింది
స్నిఫర్ డాగ్ మసీదులో వాసన చూస్తోంది
వేకువ ఝామున జవాను
సమయం సరిచేస్తుంటే
ఊరికే పడున్న ఉరికొయ్యలను
నిద్ర లేపుతున్నారు కొందరు
అమ్మ పాలు తమ్ముడు తాగుతుంటే
అన్న గుర్రుగా చూస్తున్నాడు
గొంతులో దిగిన మందు ప్రభావంతో
కొన్ని గొంతుకలు
జిందాబాద్, ముర్దాబాద్ లుగా కొట్టుకుంటున్నాయి
ఎవరో తినిపారేసిన విస్తరికోసం
రేపటి పౌరులు కుక్కలతో కాట్లాడుతున్నారు
గోడపై పోస్టర్ చూడలేక
బురదనీళ్ళు కొట్టి పోయాడు ఓ డ్రైవర్
రెక్కలు తెగిన మానవత్వపు పావురం
చివరి శ్వాస విడుస్తుంది
మినార్ కి మందిరానికి మధ్యలో
గాయపడ్డ సూరీడు
నెత్తురు కక్కుకుంటూ రాలిపోయాడు
ప్రభాతానికి కర్ఫ్యూ లేకుంటే
రేపటికి వస్తాడు. ■

# మనిషికి జీవితంలో తగినంత సమయం చిక్కదు

ఇజ్రేలీ కవి : యెహుదా అమికాయ్

*(3 May 1923 - 22 September 2000)*

అతనికి కావలిసిన దానికి దేనికీ జీవితంలో
మనిషికి తగినంత సమయం చిక్కదు
అతని ప్రతి అవసరానికి తగినట్టుగా
అతనికి తగినన్ని ఋతువులు లేవు.
ఈ విషయంలో మతగ్రంథాలు చెప్పేదంతా తప్పే.
మనిషికి ఏకకాలంలోనే
ప్రేమించనూ ద్వేషించనూ వలసి వస్తుంది
అవే కళ్ళతో ఏడ్వనూ,
నవ్వనూ వలసి వస్తుంది,
ఆ చేతుల్తోనే రాళ్లు విసరనూ,
ఏరుకోనూ వలసి వస్తుంది
యుద్ధంలో ప్రేమించనూ,
ప్రేమలో పోరాడనూ వలసి వస్తుంది
ద్వేషించి క్షమించనూ,
గుర్తుండి మరిచిపోనూ వలసి వస్తుంది,
సవరించి చిందరపరచనూ వస్తుంది,
తిని అరిగించుకోనూ వలసి వస్తుంది
చరిత్రకి కొన్ని యుగాలుపడితే.
మనిషికి సమయం దొరకదు.
అతను పోగొట్టుకున్నాకే కావాలనుకుంటాడు,
దొరకగానే మరిచిపోతాడు,
మరిచిపోయినదాన్ని ప్రేమిస్తాడు,
ప్రేమించినదాన్ని నెమ్మదిగా
మరిచిపోనారంభిస్తాడు.
అతని ఆత్మ కాలానికి రాటు దేరింది,
ఏది ఎప్పుడు ఎంతవరకు చెయ్యాలో
అంతే చేస్తుంది.
అతని శరీరమే, ఎప్పటికీ పరిణతి సాధించదు.
ప్రయత్నిస్తుంది, లక్ష్యం తప్పుతుంది;
తాగి సోలుతుంది, ఏదీ నేర్చుకోదు;
తాగి తాగి బాధల, ఆనందాల మత్తులో
గుడ్డిగా మసలుతుంది.
చివరికి శరత్తులో పండుటాకులా రాలిపోతాడు,
ముడుతలు పడి, తీయగా, బాగా మగ్గిన పండులా,
ఆకులు నేలమీద తడి ఆరుతుంటే,
మొండి కొమ్మలు ఆకాశంవంక చూస్తూ చెబుతాయి:
దేనికయినా ఒక సమయం ఉంటుందని. ■

# నగరంలోని చెట్లు

అమెరికను కవయిత్రి :
ఎడ్నా సెంట్ విన్సెంట్ మిలే

పుర వీధుల్లోని చెట్లు
రోడ్లమీద వాహనాలూ, రైళ్ళ కూతలూ లేకుంటే
జనపథాలపక్కని చెట్లలా,
అంత సుతిమెత్తని, తీయని ధ్వని చేస్తాయి.
వర్షానికి, వాటి నీడలో
తలదాచుకుంటున్న మనుషులు
నిస్సందేహంగా
పల్లెల్లోని చెట్లమీద
వాన చేసే సంగీతాన్ని వినగలరు
నగర రణగొణధ్వనికి
మౌనాన్ని వహించే చిన్ని చిగురాకుల్లారా!
పిల్లతెమ్మెర వీచినపుడు నే గమనించా,-
మీరెంత చిరుసవ్వడి చేస్తారో. ■



## శిశువు....

అమెరికను కవయిత్రి : సిల్వియా ప్లాత్

నిర్మలమైన నీ కనులు
అత్యంత సుందరంగా ఉన్నాయి.
వాటిని నేను రంగులతో,
పక్షులతో నింపదలుచుకున్నాను,
ఒక కొత్త జంతు ప్రపంచం
దానికేపేరు పెడతావో నువ్వే ఊహించు
“తుహినకుసుమ”మా, మోహన మురళీ
చిన్నారీ.....
మొనదేరిన అంకురం,
పోలికలు ఉదాత్తంగా
సాంప్రదాయికంగా ఉండే సరస్సు....
వ్యాకులమైన మనసుతో
చేతులు నులుపుకుంటూ,
చుక్కలెరుగని చూరుకింద కూచోడం కాదు. ■

*గమనిక : Snowdrop అన్నది తెల్లగా, స్వచ్ఛంగా ఉండే పువ్వు సిల్వియా ప్లాత్ కవితలు సాంప్రదాయకమైన శిల్పంతో ఉండవు. చాలా పదాలు ఊహించు కోవలసిందే. కేవలం పదచిత్రాలు మాత్రమే ఇవ్వబడతాయి. ఈ కవిత శీర్షిక చదవగానే మహాకవి గుర్రం జాషువా గారి ఆణిముత్యాల్లాంటి పద్యాలు గుర్తుకు రాకమానవు.*

## అమరులు

వడ్డెబోయిన శ్రీనివాస్, 9885756071

నన్ను
చూస్తూ చూస్తూ
వొక సీతాకోక చిలుకల గుంపు
రంగు రంగుల పుష్ప గుచ్ఛంలా హత్తుకుంది
నన్ను
చూస్తూ చూస్తూ
వొక విస్తారమైన గాలి
హృదయంలో నింపుకొని తన్మయిస్తోంది
నన్ను
చూస్తూ చూస్తూ
గరక పోచల మంద
పాదాల మీద తల వాల్చాయి
‘ఏయ్!
అది అమరుల స్తూపం’ అన్నాను.
‘తెలుసు
మేం అమరులం కాలేంగా’ ముక్త కంఠంగా...■

## సం‘కుల’ కాలం

డా॥ కలందర్ భాషా, 9642139931

కాలం అంటే కలం
అని వినిపిస్తుంది ఒకరికి!
కలం అంటే గళం
అనిపిస్తుంది కొందరికి!
గళం అంటే కులం
కనిపిస్తుంది ఇంకొందరికి!
కులం ఉంటే కూలం
అనిపిస్తుంది మరికొందరికి!
కలకలమే గరళ గాలమై
కళ్ళెం వేసేస్తుంది అందరికీ !! ■



# గుప్పెడు మట్టి

శ్రీరామ్, 9963482597

మట్టి మూగబోయింది
పూలగుత్తుల్ని రాగాలు చేసి పాటలా
పరిమళించే మట్టి
లేత చివుర్లుకు ఆయువుపట్టి
ప్రేమగా పొదివిపట్టిన పాదుల్లోని మట్టి
మాట పలుకు మరచిపోయింది
నిప్పు కణికల్ని సైతం మింగి
నిలువుగా మండి గుల్లబారిన మట్టి
గుండెల్ని నాగలి కర్రుకి నిలువునా చీల్చుకుని
ఆరుగాలం పంటపొలమైన మట్టి
ఆకలి తీర్చిన మట్టి
గుప్పెడంటే గుప్పెడు మట్టి
గ్రామసభల గుంపుల్లో ఒంటరైంది

పసితనం పాదాలు తొడుక్కొని
ఆకాశానికెగిరిన మట్టి
వానజల్లుతో జతకట్టి
నేలంతా సువాసనలిచ్చిన మట్టి
హద్దురాళ్ళు పాతుకున్న ఇరుకుతనంలో
అడ్డంగా నిలువుగా అడ్డగోలుగా
కమర్షియల్ కన్నులపండుగను
మెళ్ళోమోస్తున్న కన్వర్టర్‌మట్టి
ఒళ్ళంతా తాళ్ళుకట్టి సర్వేలు చేస్తుంటే
సన్నబడిపోయింది.
మట్టి గుండె మూగ బోయింది....నిజం
నాగరికతల్ని నడిపించిన మట్టి
నాన్నల్ని నానమ్మల్ని తానేనన్న మట్టి
ఆ గుప్పెడంటే గుప్పెడే మట్టి
గజాలుగా, శెంట్లుగా ఎగ్రిమెంట్ల బేరాల్లో
ఎంగిలాకులా పీలికలైంది
నిజం..
కొత్తరాజధాని ప్రభల ఊరేగింపుల్లో
ఊపిరందక ఉరేసుకుంది
ఆటబొమ్మైన మట్టి ఆయువైన మట్టి
మనిషి బ్రతుకును జాలిపడి ఆదరించిన
అమ్మలాంటి మట్టి
కౌలుడబ్బుల సంబరంలో
గాయాలుపడ్డ గారాలమట్టి
కంపించిపోయింది....కళ్ళొత్తుకుంది.... ■

ప్రమీలగారి కవిత 'నాక్కొంచెం మట్టికావాలి' ప్రేరణతో

## 'అనుపమ'కు సుజన కవితా పురస్కారం



ప్రముఖ కవి బండ్ల మాధవరావు రచన 'అనుపమ' కవితా సంపుటికి చిత్తూరు జిల్లా పలమనేరులో మే 10, 2015న 'సుజన' కవితా పురస్కారం అందజేసినట్లు పలమనేరు రచయితల సంఘం అధ్యక్షులు బాలాజీ తెలియజేశారు.

# వ్వెవ్వె. వ్వెవ్వెవ్వె

*John Donne 'Deth'* కు స్వేచ్ఛానువాదం

డి. కుమారస్వామి రెడ్డి, 94410 50964

మరణమా!అన్ని తెలిసి
నిన్ను ముద్దుగా
"మిత్రుడా", "ఇష్టసఖా" అంటూ సంభోదిస్తాను
ఎందుకంటె
నీవు ద్రోహివి కావు

కానీ..
అంతా నీ చేతిలో వుందని
అంతిమ తీర్పు నీదేనని
కన్ను మిన్ను కానని
'అహ' మెందుకు నీకు?

ఒప్పుకుంటాం
మనుషులందరం ఒప్పుకుంటాం!
ప్రళయ సింజానం
నీ శంఖారావం!
నీ పద ఘటన భూకంపం!
ఎందరెందరో భయంతో వణకవచ్చు
నీవు ఎవరిని వరిస్తావో
వారందరిని హరిస్తానని భ్రమపడ్తావ్!

ప్ఛ్! నీ పిచ్చి గానీ
వరించడం, హరించడం
పరిహరించడం పరిమార్చడం
నీ శక్తిలో లేనివి తెలుసా?!
స్మృతి కెన్నడూ మృతి లేదు
నీ కసలు మతిలేదు!

ఋతువు ఋతువుకు
ప్రకృతి సోయగం మారినట్లు
మనిషి మేనిపై దుస్తులు మార్తాయి
శరీరం తను
శైశవం వీడి యవ్వనమూ
యవ్వనము వీడి
వృద్ధాప్యం వరిస్తుంది
వెలుతురు నుండి చీకటి
చీకటి నుండి వెలుతురు లోకి
లోకం లోలకంలా నడిచే లోగిలి ఇది

నిద్ర నుండి మెళకువ
మెళకువ నుండి నిద్రలోకి
దేహం ఊయల లూగుతుంది

ప్రతి కాలంలోను ఋతువులోను
గోడలపై కదులుతున్న
నీడలకుడ్య చిత్రం జీవితం!

నిద్దుర మాకు లిప్త కాలపు మరణం
కొంతహాయి, కొంత సుఖం, కొంత విలాసం!
మరి..మరణం మాకు ఓ పెన్నిద్దుర!
అది మరింత హాయి, మరింత సుఖం
మరెంతో విలాసం!
మరణం ఎంత వైభవమో కదా!
స్మృతి కెన్నడు మతి లేదు
రాణులతో, చెలియలతో
ఇష్ట సఖాలతో చెలిమిలో
చేయి చేయి కలిపి
చెట్టాపట్టాలేసుకుని
ఈ నేలకు ధరాధిపతులైన
రాజులు రారాజులు సైతం
జీవన వైభోగ వీవనలను
చరమాంకంలో వీడారు

అలసి సొలసిన దేహాలతో
కలలు నెలసి పోయిన మనస్సులతో
కత్తి పోట్లకు, వెన్నుపోట్లకు

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Kavitaa+29

* * *